


మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు



అన్నారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేటీఆర్



మేడిగడ్డకు చేరుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, కౌశిక్ రెడ్డి, తదితరులు

కాళేశ్వరం ప్రాజెక్టు యాత్రలో బీఆర్ఎస్ నేతలు కడియం, కేటీఆర్, హరీశ్

## కేసీఆర్‌పై కోపంతో..

# రైతులపై పగబట్టకండి

- మేడిగడ్డకు మరమ్మతులు చేయించి.. నీళ్లను లిఫ్ట్ చేయండి
- 3 పిల్లర్లకు సమస్య వస్తే.. కాళేశ్వరం మొత్తం నష్టపోయిందని బద్నాం చేస్తున్నరు
- రైతులకు కామధేనువు లాంటిది కాళేశ్వరం

'కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు కామధేనువు. అటువంటి కాళేశ్వరాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయండి. నీళ్లను వెంటనే లిఫ్ట్ చేసి రైతులకు అందించండి. నల్లగొండ సభలో కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు బీఆర్ఎస్ నేతలమంతా మేడిగడ్డకు వచ్చాం. ప్రాజెక్టు రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వమే గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నది. దాన్ని అడ్డుకుని ప్రజలకు వాస్తవాలు వివరించేందుకే ఇక్కడికి వచ్చాం. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల పొడవైన టన్నెల్స్, 1500 కిలోమీటర్లకు పైగా ఉండే కాలువలు కలిగిన భారీ ప్రాజెక్టు కాళేశ్వరంలో కేవలం మేడిగడ్డ బ్యారేజీలో 3 పిల్లర్లకు సమస్యలు వస్తే రాద్ధాంతం చేస్తున్నారు' అని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారంపై వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పేందుకు బీఆర్ఎస్ నేతలు శుక్రవారం చేపట్టిన చలో కాళేశ్వరంలో భాగంగా ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి మాట్లాడారు. కేసీఆర్‌పై కోపముంటే ఆ కోపాన్ని దయచేసి రైతులపై రాష్ట్రంపై చూపవద్దని వారు కోరారు. ఆలస్యం చేయకుండా మేడిగడ్డకు మరమ్మతులు చేయించి రైతులకు సకాలంలో నీళ్లు అందేలా చూడాలని చెప్పారు.



మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, తదితరులు



మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ నామ నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, తదితరులు



ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, దేవిప్రసాద్, తదితరులు



మేడిగడ్డ వద్ద కేటీఆర్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, తదితరులు

# కాపీయింగ్‌కు తావివ్వొద్దు

- ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి
- అధికారులకు వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 1: ఇంటర్ పరీక్షల్లో కాపీయింగ్‌కు తావులేకుండా కఠినంగా వ్యవహరించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఇన్విజిలేటర్లకు సూచించారు. శుక్రవారం ఆయన అనంతగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలోని ఇంటర్ మొదటి ఏడాది ఆంగ్ల పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కేంద్రంలో 318 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 13 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని..విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు కఠినంగా వ్యవహరించాలన్నా రు.

### రంగారెడ్డి జిల్లాలో.. 1,615 మంది గైర్హాజరు

రంగారెడ్డి, మార్చి 1 (నమస్తే తెలంగాణ): జిల్లాలో శుక్రవారం జరిగిన మొదటి ఏడాది ఆంగ్ల పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 76,231 మంది విద్యార్థులకు 74,616 మంది హాజరు కాగా 1,615 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వసతులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం గురించి ఆరా తీశారు.

### ప్రశాంతంగా ఆంగ్ల పరీక్ష

జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన మొదటి ఏడాది ఆంగ్ల పరీక్షకు 8,565 మంది విద్యార్థులకు 8,248 మంది హాజరు కాగా 317 మంది గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధన అమల్లో ఉండటంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సమయానికి ముందుగానే చేరుకున్నారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. జనరల్‌లో 6,872 మంది విద్యార్థులుండగా 6,655 మంది హాజరుకాగా.. 217 మంది గైర్హాజరయ్యారు. ఒకేషన్ లో 1,693 మందికి 1,593 మంది పరీక్ష రాయగా 100మంది హాజరుకాలేదు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

# అర్హులందరూ లబ్ధి పొందాలి

- అందుకు సత్వరమే ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలి
- టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్.. మాట్లాడుతున్న సీఎస్

రంగారెడ్డి, మార్చి 1(నమస్తే తెలంగాణ)/వికారాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అర్హులందరూ లబ్ధిపొందేలా కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హులందరూ ప్రయోజనం పొందేలా అన్ని ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ వార్డు ఆఫీసుల్లో సత్వరమే ప్రజాపాలన సేవా కేంద్రాలను నెలకొల్పాలని ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర డీజీపీ రవిగుప్తాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తులు చేసుకోలేకపోయిన అర్హులతోపాటు దరఖాస్తుల్లో సరైన వివరాలు నమోదు చేయని వారికోసం ప్రజాపాలన సేవా కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా ఏర్పాటైన పలు మండలాల్లోఎంపీడీవో కార్యాలయాలు లేనందున, అలాంటి చోట తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చి.. కంప్యూటర్లు ఏర్పాటు చేసి వాటికి ఇంటర్నెట్ సదుపాయాన్ని కలిపించి డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలన్నారు. వచ్చే సోమవారం నాటికి అన్ని చోట్ల సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చి పని తీరు ప్రారంభం కావాలని ఆదేశించారు. కార్యాలయాల పనిదినాల్లో ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు తెరిచి ఉంచాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోలేకపోయిన వారి కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఫారాలను అందుబాటులో ఉంచాలన్నారు.

### పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్‌తోపాటు త్వరలో ప్రారంభం కానున్న పదోతరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్ సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించరాదని..కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, అక్రమాలకు ఆస్కారం కల్పించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ తీరును సమీక్షిస్తూ, పరీక్షలు ముగిసేంత వరకు ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, కాపీయింగ్ జరిగేందుకు అవకాశం ఉన్న సెంటర్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించాలని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు సూచించారు. అనంతరం డీజీపీ రవిగుప్తా మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, మొబైల్‌ఫోన్లను సెంటర్లలోకి అనుమతించొద్దని ఆదేశించారు. సమస్యాత్మక కేంద్రాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి జిల్లా నుంచి కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, వికారాబాద్ జిల్లా నుంచి కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు ఎస్పీ మురళీధర్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 9, 10 తేదీల్లో వాలీబాల్ టోర్నీ

చేవెళ్లటౌన్, మార్చి 1 : ఓపెన్ టూ ఆల్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాలీబాల్ టోర్నీని ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం చేవెళ్లలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని దామరిగిద్ద గ్రామంలో సీనియర్ నేషనల్ క్రీడాకారుడు అనిల్‌కుమార్ స్మారకార్థం ఈ టోర్నీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు, 7, 8 తేదీల్లో తమ జట్ల పేర్ల టను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96523 67268 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలి

షాద్‌నగర్, మార్చి 1 : అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని కేశంపేట టీపీయూఎస్ మండలాధ్యక్షుడు అంజన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేశంపేట మండల కేంద్రంలో సుమారు 12 మంది ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల అండదండలతో హైదరాబాద్‌కు అక్రమంగా డిప్యుటేషన్ వేయించుకుని వెళ్లారని వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన అధికారులు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులకు మాత్రమే ఆర్డర్స్ ఇచ్చినట్లు తెలిపారు. మిగతా పదిమంది ఉపాధ్యాయులు హైదరాబాద్‌కు దగ్గరలోనే పనిచేస్తున్నారని.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్ని డిప్యుటేషన్లను రద్దు చేసి ఉపాధ్యాయులను వారి వారి పాఠశాలలకు వెళ్లేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు.



## కోడ్ కూసినా పార్టీ గుర్తుతో ఫ్లెక్సీలు..

దుద్యాల మండలం పోలేపల్లి ఎల్లమ్మ జాతరలో కాంగ్రెస్ పార్టీ గుర్తుతో ఉన్న ఫ్లెక్సీలు కనిపించాయి. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయిన కారణంగా కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల, దౌల్తాబాద్ మండలాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయం తెలిసిందే. ఆ పార్టీ నాయకులు దీనిని పట్టించుకోలేదని పలువురు చర్చించుకున్నారు.

-బొంరాస్‌పేట, మార్చి 1

# చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

### రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

రంగారెడ్డి, మార్చి 1(నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరించిన మాట్లాడారు. మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణకోసం జిల్లా వైద్యారోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లాలో 0-5 ఏండ్ల లోపు 4,09,308 పిల్లలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమ నిర్వహణ కోసం 624 పోలియో బూత్‌లు, 55 మొబైల్ టీములు, 55 ట్రాన్సిట్ పాయింట్లు, సమాచార విస్తరణకు 55 వాహనాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మార్చి 3న పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు సోమ, మంగళవారాల్లో వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ స్వర్ణకుమారి, రాష్ట్ర సర్వేలైన్ అధికారులు.. 11 మంది ఆఫీసర్లు, 1600 మంది అంగన్‌వాడీ టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 681 వైద్య సిబ్బంది, 1,385 మంది ఆశవర్కర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, సంబంధిత డాక్టర్లు పాల్గొన్నారు.

### సక్సెస్ చేయాలి

వికారాబాద్, మార్చి 1: చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3 ఆదివారం జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలన్నారు. జిల్లాలో ఐదేండ్ల లోపు చిన్నారులు 89,903 మంది ఉన్నారని.. వారందరికీ చుక్కల మందు పంపిణీ చేసేందుకు 566 పోలియో కేంద్రాల ద్వారా 1132 మంది సిబ్బందితోపాటు 57 మంది రూట్ సూపర్‌వైజర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 25 మొబైల్ బృందాలు పని చేస్తాయని చెప్పారు. మార్చి 3న పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు సోమ, మంగళవారాల్లో వేయడం జరుగుతుందన్నారు. ప్రజలందరికీ తెలిసేలా ప్రతి గ్రామంలోనూ దండోరా వేయించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్, జడ్పీసీఈవో సుధీర్, డీపీవో, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.